క్లుప్తంగా

ప్రత్యేక అలంకరణలో కాళీమాత అమ్మవారు



జగ్గయ్యపేట అర్బన్:ఆషాఢ మాసం ఆదివారం పురస్కరించుకొని పట్టణంలోని కోదాడ రోడ్ శాంతినగర్‌లో వేంచేసియున్న శివదుర్గా భవాని విశ్వరూప కాళీ మాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు తానూరి శ్రీనుస్వామి అమ్మవారికి ప్రత్యేకంగా నిమ్మకాయదండలు, వడమాల అలంకరణ, రంగు రంగుల పూలతో అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

శాకంబరిగా నాగ సత్యమ్మ



జగ్గయ్యపేట అర్బన్:పట్టణ సమీపంలోని విశాఖ స్టీల్ ప్లాంట్ క్వార్టర్స్‌లో వేంచేసియున్న నాగ సత్యమ్మ అమ్మవారి ఆలయంలో అమ్మవారిని ఆషాఢ మాసం ఆదివారం పురస్కరించుకొని శాకంబరిగా అలంకరించారు. ఆలయ అర్చకులు టీఎల్ఎస్ ఆచార్యులు, కృష్ణ భరద్వాజ్‌ల ఆధ్వర్యంలో అమ్మవారికి ఉదయం పంచామృత అభిషేకాలు నిర్వహించారు. అనంతరం వివిధ రకాల కూరగాయలు, పండ్లతో అమ్మవారికి శాకాంబరి అలంకారం నిర్వహించారు. కార్యక్రమంలో వీఎస్‌పీ జేఎల్ఎం ఇన్‌చార్జ్ బీయూవీఎస్.రాజు, ఆలయ కమిటీ ప్రతినిధి పీఆర్‌కే.రాజు, ఉద్యోగ ప్రముఖులు శ్రీనివాసరావు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

మొక్కల సంరక్షణకు మోటార్ వితరణ



జగ్గయ్యపేట అర్బన్:పట్టణంలోని బలుసుపాడు రోడ్‌లో ముస్లింలు ప్రార్థనలు నిర్వహించుకునే చారిత్రాత్మకమైన ఈద్గాకు ఇటీవల ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను రూ.50 వేల వ్యయంతో మొక్కలను అందజేశారు. కాగా వాటి సంరక్షణకు గాను అవసరమైన మోటార్ కొనుగోలుకు కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు రూ.20 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆదివారం స్థానిక పాత గురుకుల పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఈ ఆర్థిక సహాయాన్ని తన్నీరు నాగేశ్వరరావు ఎమ్మెల్యే ఉదయభాను చేతుల మీదుగా వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షుడు, ఈద్గా కమిటీ అధ్యక్షుడు షేక్ మొహిద్దీన్‌కు అందజేశారు.

నేడు స్పందన కార్యక్రమం

నందిగామ: పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం జరుగుతుందని ఆర్డీవో రవీంద్రరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు స్పందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తుందని తెలిపారు. డివిజన్ పరిధిలోని మండలాల ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కంచికచర్లలో.....

కంచికచర్ల: ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం సోమవారం ఉదయం 10 గంటల నుంచి జరుగుతుందని తహసీల్దార్ శంకరబాబు ఆదివారం తెలిపారు. గ్రామాల్లో ఉన్న సమస్యల పరిష్కారం కోసం ప్రజలు అర్జీలు దఖలు చేసుకోవచ్చని చెప్పారు. వచ్చిన అర్జీలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తామన్నారు.

నేడు సచివాలయ భవనం ప్రారంభం

వీరులపాడు:మండలంలోని వెల్లంకి గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవన ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ కోటేరు లక్ష్మీ పేర్కొన్నారు. సోమవారం ఉదయం ఏడు గంటలకు శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు చేతుల మీదుగా ప్రారంభోత్సవం ఉంటుందని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్‌లు పాల్గొనాలని కోరారు.

నేడు శాకంబరి అలంకరణలో సత్యమ్మ

నందిగామ: మండలంలోని అంబారుపేట గ్రామంలో గల సత్యమ్మ అమ్మవారు సోమవారం గురు పౌర్ణమి సందర్భంగా భక్తులకు శాకంబరిగా దర్శనం ఇవ్వనున్నారు. ఏటా అమ్మవారిని ఆషాఢ మాసంలో శాకంబరిగా అలంకరించి విశేష పూజలు నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది కూడా అమ్మవారిని శాకంబరిగా అలంకరించడంతోపాటు విశేష పూజలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

హరిత శోభితం.. తిరుపతమ్మ ఆలయం



శాకంబరీ అలంకరణలో గోపయ్య సమేత తిరుపతమ్మ అమ్మవారు



అమ్మవారి దర్శనానికి క్యూలైన్‌లో భక్తులు



హరిత శోభితంగా ఆలయ పరిసరాలు

శాకంబరీగా తిరుపతమ్మ దర్శనం

పెనుగంచిప్రోలు(జగ్గయ్యపేట): ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలులో వేంచేసిన శ్రీతిరుపతమ్మ అమ్మవారు ఆదివారం శాకంబరీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని శ్రీగోపయ్య సమేత శ్రీతిరుపతమ్మ, సహదేవతల ఉపాలయాలు, ఆలయ పరిసరాలను వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలు, పండ్లతో అలంకరించారు. తల్లిని దర్శించుకునేందుకు తెల్లవారు జాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో బారులు తీరారు. కరువు, కాటకాలు లేకుండా, పాడి పంటలతో వర్ధిల్లేలా కాపాడాలంటూ అమ్మవారిని వేడుకున్నారు. అమ్మవారిని శాకంబరీ అలంకరణలో పూజిస్తే శుభాలు కలుగుతాయని ఆలయ వేద పండితులు పేర్కొన్నారు. ఆలయ ఈఓ కె.రమేష్‌నాయుడు, చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు, పాలకవర్గ సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు. భక్తులకు ప్రత్యేకంగా కదంబ ప్రసాదం పంపిణీ చేశారు.

ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను



పేటలో చెరువు అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్:జగ్గయ్యపేటను జిల్లాలో మేటైన పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు పోతున్నట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. అందుకోసం జగ్గయ్యపేట ఊర చెరువును హైదరాబాద్‌లో ట్యాంక్ బండ్, ఖమ్మంలో లకారం మాదిరిగా సుమారు రూ.10 కోట్ల ప్రాజెక్టుగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం పట్టణంలోని ఊరచెరువును ఆయన పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ జగ్గయ్యపేట పట్టణాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు చెప్పారు. దానిలో భాగంగా ఊరచెరువునంతా ప్రక్షాళన చేసి సుందరంగా తీర్చిదిద్దనున్నట్లు పేర్కొన్నారు. చెరువు చుట్టూ గ్రీనరీ, వాకింగ్ ట్రాక్, లైటింగ్, బోటు షికారు, ఓపెన్ జిమ్ తదితర హంగులతో చెరువును అభివృద్ధి పరచి పర్యాటకులను ఆకర్షించే విధంగా తయారు చేస్తామని వెల్లడించారు. అందుకు సుమారు రూ.10 కోట్ల వ్యయం కానుందని, తమ వంతు సహకారంగా ఆల్ట్రాటెక్ వారు సీఎస్సార్ నిధుల నుంచి రూ.1 కోటి, రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.2 కోట్లు కేటాయించారని తెలిపారు. గత మూడు నెలల నుంచి వేగవంతంగా పనులు జరుగుతున్నాయన్నారు. కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, కౌన్సిలర్లు నూకల సాంబ, తన్నీరు నాగేంద్ర, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, నాయకులు కుంచపు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

గొప్ప లక్ష్యంతో అమ్మఒడి పథకం



ప్రభుత్వ విప్ ఉదయభానును సన్మానిస్తున్న ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ ప్రతినిధులు

జగ్గయ్యపేట అర్బన్:అమ్మ ఒడి పథకాన్ని ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు అందజేస్తున్నందుకు గాను డివిజన్ ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ సభ్యులు ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభానును ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసిన ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ సభ్యులు ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఉదయభాను మాట్లాడుతూ చదువుకు పేదరికం అడ్డు కాకూడదని, బడి బయట ఏ ఒక్క చిన్నారి ఉండకూడదనే గొప్ప లక్ష్యంతో పిల్లల్ని బడికి పంపే ప్రతి తల్లి ఖాతాలో అమ్మ ఒడి పథకం ద్వారా ప్రతి ఏడాది రూ.15 వేల చొప్పున ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి అందజేస్తున్నారని తెలిపారు. దీనిలో భాగంగా నాల్గొవ విడత అమ్మ ఒడి ద్వారా పేట నియోజకవర్గ వ్యాప్తంగా రూ.26.95 కోట్లు తల్లుల ఖాతాల్లో జమ చేశారన్నారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు బద్దూనాయక్, ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ పేట డివిజన్ అధ్యక్షుడు కొమరగిరి భరద్వాజ్, గౌరవ అధ్యక్షుడు బొల్లా శ్రీనివాస్, కార్యదర్శి షేక్ కాలేషా, కోశాధికారి బొన్నం ప్రతాపరెడ్డి, వివిధ పాఠశాలల అధినేతలు పాల్గొన్నారు.

చెంబేటి మృతి తీరనిలోటు



మాట్లాడుతున్న ప్రభుత్వవిప్ ఉదయభాను, పక్కన ఎమ్మెల్సీ అరుణ్‌కుమార్

దబ్బాకుపల్లి(వత్సవాయి): మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడు చెంబేటి వెంకటేశ్వర్లు అకాల మరణం పార్టీకి, వ్యక్తిగతంగా తనకు తీరనిలోటని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను తెలిపారు. ఆదివారం ఎంపీపీ చెంబేటి సంతాపసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉదయభానుతోపాటు ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్ పాల్గొని మాట్లాడారు. ఎంపీపీగా విధులు నిర్వహిస్తూ అకాల మరణం చెందడం బాధాకరమన్నారు. సొసైటీ అధ్యక్షుడిగా నాలుగు పర్యాయాలు పనిచేసి సంఘం బలోపేతం కోసం కృషి చేశారని కొనియాడారు. పార్టీ పట్ల అంకితభావం కలిగిన వ్యక్తిగా ఈ ప్రాంత ప్రజలకు చెంబేటి సుపరిచితులని గుర్తు చేసుకున్నారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేడీసీసీ బ్యాంకు చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, జెడ్పీటీసీ యేశపోగు దేవమణి శ్రీనివాస్, పెనుగంచిప్రోలు ఎంపీపీ మార్కపూడి గాంధీ, నాయకులు గూడపాటి శ్రీనివాసరావు, వేల్పుల రవికుమార్, కాటేపల్లి రవి కుమార్, మండల పార్టీ అధ్యక్షులు గాదెల రామారావు, సర్పంచ్ కొట్టె నగేష్, రంగిశెట్టి ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పవిత్రోత్సవాలు



వేదాద్రి(జగ్గయ్యపేట):ప్రముఖ పుణ్యక్షేత్రం యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయంలో జరుగుతున్న పవిత్రోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి వారికి విశేష పూజలు చేశారు. ముందుగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి పంచగవ్యప్రాసన, అగ్నిమదనం, ప్రధాన హోమం, తదితర కార్యక్రమాలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ఈవో హేమలతా దేవి భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

అన్నదానం భక్తుల సంఖ్య పెంపు

పెనుగంచిప్రోలు:గ్రామంలో వేంచేసి ఉన్న తిరుపతమ్మవారి ఆలయంలో నిత్యాన్నదానం భక్తుల సంఖ్య పెంచుతున్నట్లు ఆలయ ఈఓ, డెప్యూటీ కలెక్టర్ కె. రమేష్‌నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి శుక్రవారం 100, ఆదివారం 200, మిగిలిన రోజుల్లో 75 మందికి అన్నదానం ఏర్పాట్లు చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వైద్యులకు సత్కారం



డాక్టర్లను సత్కరిస్తున్న లయన్స్ క్లబ్ ఆఫ్ జగ్గయ్యపేట ప్రతినిధులు

జగ్గయ్యపేట అర్బన్: లయన్స్ క్లబ్ ఆఫ్ జగ్గయ్యపేట ఆధ్వర్యంలో డాక్టర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ కమ్యూనిటీ హాల్లో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ రాజాకేశవప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పేట ప్రాంతానికి చెందిన ఆరుగురు వైద్యులు, ఒక చార్టెడ్ ఎకౌంటెంట్‌ను సన్మానించారు. వారిలో ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ ఆళ్ల హరీష్, ప్రముఖ నేత్ర వైద్యులు సామినేని నరసింహారావు, నేత్ర వైద్యులు గోన సౌజన్య, అమెరికన్ హాస్పిటల్ గైనకాలజిస్ట్ సతీష్, రామ్‌కో సిమెంట్స్ వైద్యులు రాజాకేశవప్రసాద్, అమెరికన్ హాస్పిటల్ డీన్ సిస్టర్ సుగంధి, ప్రముఖ చార్టెడ్ ఎకౌంటెంట్ సీహెచ్ సుష్మిత ఉన్నారు. కార్యక్రమంలో క్లబ్ ప్రాంతీయ చైర్మన్ కె.మోహన్‌బాబు, ప్రాంతీయ కార్యదర్శి షేక్ ఖాసిం సైదా, జోన్ చైర్మన్ నారాయణరెడ్డి, కార్యదర్శి పి.కృష్ణమూర్తి, కోశాధికారి కె.కరుణాకర్, క్లబ్ సీనియర్ ప్రతినిధులు బదరీనారాయణ, పసుపులేటి ప్రసాద్, వై.వెంకటేశ్వరరావు, జి.మహేష్, ఎం.నరసింహారాజు, జాన్ పాల్ పాల్గొన్నారు.

8న వైఎస్సార్ ఉచిత పంటల బీమా విడుదల

కంచికచర్ల: డాక్టర్ వైఎస్ఆర్ ఉచిత పంటల బీమా -పీఎంఎఫ్ బీ వై 2022 (దిగుబడి ఆధారిత పథకం) కింద దిగుబడి ఆధారంగా పరిహారం పొందుటకు అర్హులైన ముసాయిదా లబ్ధిదారుల జాబితాను రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శనకు ఏర్పాటు చేశామని మండల వ్యవసాయ అధికారి కె. విజయకుమార్ ఆదివారం తెలిపారు. సామాజిక తనిఖీ నిమిత్తం పత్తి పంటకు సంబంధించిన జాబితాల ప్రదర్శనకు ఏర్పాటుచేశామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జూలై 8వ తేదీన వైఎస్సార్ ఉచిత పంటల బీమా, ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పరిహారం విడుదల చేస్తారని చెప్పారు. రైతులు ఆయా రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శించిన ముసాయిదా జాబితాలను పరిశీలించుకోవాలని సూచించారు. ఏదైనా అభ్యంతరాలు ఉంటే సంబంధిత గ్రామ వ్యవసాయ- ఉద్యానవన సహాయకుల దృష్టికి తీసుకురావాలని కోరారు.

ఘనంగా తిరుపతమ్మ అమ్మవారి గ్రామోత్సవం



శాకాంబరీ అలంకరణలో రథంపై ఊరేగుతున్న అమ్మవారు

పెనుగంచిప్రోలు:శాకంబరీ ఉత్సవం అనంతరం ఆదివారం రాత్రి గోపయ్య సమేత తిరుపతమ్మ అమ్మవారి ఉత్సవ మూర్తులను అందంగా, పలు రకాల శాకములు (కూరగాయలు)తో అలంకరించిన రథంపై ఉంచి గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా రథం ముందు అనాదిగా వస్తున్న ఆచారం ప్రకారం రజకులు, యాదవులు కుంభం పోశారు. అనంతరం ఆలయ ఈఓ కె.రమేష్‌నాయుడు, చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు కొబ్బరికాయలు కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈఈ వైకుంఠరావు, ఏఈ రాజు, పాలకవర్గ సభ్యులు, సిబ్బంది, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

● శాకంబరీ.. శరణు శరణు





ఇంద్రకీలాద్రిపై నిర్వహిస్తున్న శాకంబరీ దేవి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. రెండో రోజైన ఆదివారం అమ్మ వారికి హైదరాబాద్ భాగ్యనగర్ కమిటీ బంగారు బోనం సమర్పించడంతో పాటు పెద్ద సంఖ్యలో భక్త బృందాలు ఆషాఢ సారె సమర్పించేందుకు తరలిరావడంతో ఆలయ ప్రాంగణంలో కోలాహలం నెలకొంది. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ







శీలం దివ్య అకాల మృతి బాధాకరం

నందిగామ టౌన్:అతి చిన్న వయసులో శీలం దివ్య అకాల మృతి బాధాకరమని శాసన మండలిసభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్ తెలిపారు. పట్టణంలోని ఏడవ వార్డుకు చెందిన శీలం రాజారావు, కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. ముందుగా దివ్య చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అరుణకుమార్ మాట్లాడుతూ ఎంతో ఉజ్వల భవిష్యత్తు ఉన్న దివ్య విజయవాడ నుంచి వస్తూ నందిగామ పట్టణ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందటం తనను కలిచి వేసిందన్నారు. కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటామని పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి అందాల్సిన సాయాన్ని సత్వరమే అందించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ సొంత నిధులు రూ. 50 వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో నాయకులు వైఎస్ఎస్ ప్రసాద్, మన్నం దాసు, పిల్లి జయరాజు, పరిమి కిషోర్, బెజవాడ రాజశేఖర్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

వీరులపాడు:శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదని ఎస్‌ఐ మహాలక్ష్మణుడు హెచ్చరించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్‌లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రౌడీషీటర్‌లు, అనుమానితులు, పాత నేరస్థులపై నిఘా ఉంటుందన్నారు. చట్టానికి లోబడి నడుచుకోవాలని సూచించారు. చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడుతూ నేర ప్రవృత్తిని కొనసాగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. మంచి నడవడికతో కుటుంబంతో కలిసి ఆనందంగా జీవించాలని చెప్పారు. సత్ప్రవర్తనతో నడుచుకునే వారిపై రౌడీ షీట్ తీయించేలా ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ నాగేశ్వరరావు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.